రుద్రేశ్వర స్వామికి లక్ష తులసీ అర్చన చేస్తున్న గంగు ఉపేంద్రశర్మ

రుద్రేశ్వరుడికి లక్ష తులసీ అర్చన

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 4: చారిత్రక వేయిస్తంభాల ఆలయంలోని రుద్రేశ్వర స్వామికి సోమవారం భక్తులు లక్ష తులసి దళాలతో అర్చన గావించారు. మొదట ఉత్తిష్ఠ గణపతికి నారికేళ జలాభిషేకం, రుద్రేశ్వర స్వామికి నమకచమకాదులతో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ప్రదోశకాల సమయంలో సోమశేఖర శర్మ ఆధ్వర్యంలో కార్తీక పురాణ ప్రవచనాలు, భక్త మండళ్ల ఆధ్వర్యంలో భజనలు నిర్వర్తించారు. మహిళలు ఉసిరిక వృక్షాల వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులు శివ పంచాక్షరి మంత్రాన్ని పఠిస్తూ స్వామిని దర్శించుకున్నారు. జిల్లా న్యాయమూర్తులు, ఎన్నికల పరిశీలకులు స్వామి వారిని దర్శించుకున్నారు. వైదిక కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈవో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఈ నెల 10న ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 4: 2023-24 విద్యా సంవత్సరానికి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ ప్రవేశ పరీక్ష ఈ నెల 10న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ రాంకుమార్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి మందల రవీందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో 2 కేంద్రాలను ఏర్పాటు చేశామని, భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 233 మంది, కాటారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 148 మంది విద్యార్థులను కేటాయించామని తెలిపారు. పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, హాల్ టికెట్లను సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరీక్షకు విద్యార్థులందరూ హాజరయ్యేలా చూడాలని వారు కోరారు.

ప్రపంచ సాహిత్య కళా ఉత్సవాలకు శశిధర్ రెడ్డికి ఆహ్వానం

సామల శశిధర్ రెడ్డి

భూపాలపల్లి రూరల్, డిసెంబర్4: ఈ నెల 16,17వ తేదీల్లో అంతర్జాతీయ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ కళావేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తాడేపల్లిగూడెంలో జరుగనున్న ప్రపంచ సాహిత్య కళా ఉత్సవాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రాంపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ సామల శశిధర్ రెడ్డికి సోమవారం ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలోని బుద్ధాల కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నారని అన్నారు. వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యం లో ప్రపంచ కవితోత్సవం, సాహి త్య సదస్సులు, కళా ప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు, ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఇందులో తన కవితా గానం వినిపించేందుకు తనకు ఆహ్వానం అందించడం ఎంతో సంతోషంగా ఉందని, వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని శశిధర్‌రెడ్డి తెలిపారు.

ప్రజా తీర్పును గౌరవిస్తా

- భూపాలపల్లిని అభివృద్ధిలో ముందంజలో నిలిపా
- ఓడిపోయినా ప్రజల మధ్యనే ఉంటా
- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా
- నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం
- గెలిచిన పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్4(నమస్తే తెలంగాణ): 'రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో భూపాలపల్లి నియోజకవర్గం నుంచి వచ్చిన ఫలితాలు నిరాశకు గురిచేశాయి.. ప్రజలు ఊహించని షాక్ ఇచ్చారు.. ప్రజా తీర్పును గౌరవిస్తున్నా' అని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతితో కలిసి మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో గడిచిన తొమ్మిదిన్నరేళ్లు ప్రజా సంక్షేమం, అభివృద్ధికి నిబద్ధతతో పనిచేశామన్నారు. కరోనా కష్టకాలంలోనూ ప్రజలకు సేవలందించామని అన్నారు. ఎన్నికైన నాటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించానని, కరోనా సమయంలో దగ్గరుండి మనోధైర్యాన్ని ఇచ్చానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని కొనసాగిస్తూ మరోవైపు జీఎంఆర్ఎం ట్రస్టు నుంచి సేవా కార్యక్రమాలు కొనసాగించానని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలు తీసుకువచ్చి అభివృద్ధిలో ముందంజలో నిలిపానన్నారు. అయినా ప్రజలు ఊహించని విధంగా తీర్పును ఇచ్చారని, ప్రజా తీర్పును స్వాగతిస్తున్నానని అన్నారు. 2009లో ఎమ్మెల్యేగా గెలుపొంది నియోజకవర్గ అభివృద్ధికి బలమైన పునాదులు వేశానని, వాటిపైనే భూపాలపల్లి అభివృద్ధిలో ముందుకెళ్తుందని.. సంక్షేమం, అభివృద్ధి ఆగవద్దని అన్నారు. తమను ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టారని, అది కీలకమైందని, అందులో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామన్నారు. ఓడినా ప్రజల మధ్యే ఉండి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని, కార్యకర్తల కృషి మరువలేనిదని.. వారికి అందుబాటులో ఉంటూ వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. అధికారులు సైతం తన సూచనలు, సలహాలు పాటిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించారని అన్నారు. కేసీఆర్ ప్రతి నియోజకవర్గానికి ఒక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నిర్మించి ఎమ్మెల్యేలు స్థానికంగా ఉండి ప్రజలకు సేవలందించేలా కృషి చేశారని అన్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, వంద రోజుల్లో అమలు చేస్తామన్నారని, ఆలస్యమైనా హామీలు అమలు చేసి ప్రజలకు సేవలందించాలని కోరారు. ఓటమిపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి హైకమాండ్‌కు నివేదిక ఇస్తామన్నారు. సమావేశంలో అర్బన్ పార్టీ అధ్యక్షులు కటకం జనార్దన్, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, జడ్పీటీసీ గొర్రె సాగర్, కౌన్సిలర్లు దారపూలమ్మ, మేకల రజిత, సజ్జనపు స్వామి, నాయకులు పింగిళి రవీందర్‌రెడ్డి, మాడ హరీశ్‌రెడ్డి, కరీం, సింగనవేని చిరంజీవి, సేనాపతి, అశోక్, బీబీ చారి, వజ్రమణి తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో కార్తీక సందడి

- రామలింగేశ్వరుడికి అభిషేకాలు, అర్చనలు
- వేలాది మంది భక్తుల పూజలు

మహాశివుడి అలంకారంలో శివలింగం

రామలింగేశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

వెంకటాపూర్, డిసెంబర్4: మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంలో కార్తీక సందడి నెలకొంది. కార్తీక మూడో సోమవారం కావడంతో వేలాది మంది భక్తులు, అయ్యప్ప స్వాములు, పర్యాటకులు రామ లింగేశ్వడికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అర్చ కులు హరీశ్ శర్మ, ఉమమాశంకర్ పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా శివలింగాన్ని మహాశివుడిగా అలంకరించారు. మహిళలు మారేడు చెట్టు కింద దీపాలు వెలిగించారు. అర్చకులకు దీపాదానాలు చేశారు.

వైభవంగా కన్నె స్వాముల పూజ

తొర్రూరు, డిసెంబర్ 4: తొర్రూరులోని మహబూబాబాద్ రోడ్డులోని హరిహర క్షేత్రం అయ్యప్ప దేవాలయంలో సోమవారం కన్నె స్వాముల పూజను వైభవంగా నిర్వహించారు. మాజేటి నరసింహారావు గురుస్వామి ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజలు ముందుగా వినాయకుడికి, సుబ్రహ్మణ్య స్వామికి, మహాశివుడు, వెంకటేశ్వరస్వాములకు అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. అనంతరం హరిహర సుతుడు అయిన శ్రీధర్మశాస్త్రకు అంగపూజ అష్టోత్తర శతనామావళి, స్వామివారికి పంచామృత అభిషేకం సుగంధ ద్రవ్యాలతో పసుపు, కుంకుమ, గంధం, విభూది, వివిధ రకాల పండ్లతో అభిషేకం చేసిన అనంతరం నైవేద్యం నివేదించి 18 మెట్ల పూజను నిర్వహించి హారతి ఇచ్చిన అనంతరం స్వాములకు మహా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి నరసింహారావు మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష చేపట్టిన వారు అయ్యప్ప ఆశీస్సులు పొందుతారన్నారు. కులాలకతీతంగా వయోభేదం లేకుండా మాల వేసుకున్న ప్రతి ఒక్కరూ స్వామి అని పిలిపించుకుంటారని, సమానత్వం అలవాటు తుందని, భక్తి భావం పెంపొందించుకుంటారని చెప్పారు. ఈ పూజలో ఆలయ నిర్వాహకులు సభ్యులు, ట్రస్టు సభ్యులు సీహెచ్ సతీశ్, బిజ్జాల వెంకటరమణ, వల్లపు మధు, తల్లాడ హీరాధర్, ఇమ్మడి రాంబాబు, దొడ్డ రఘు, కమల్ సింగ్, మధుశర్మ, నంబూద్రి పాల్గొన్నారు.

కన్నె స్వాముల పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

కాజీపేట మీదుగా పలు రైళ్లు రద్దు

- తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తమైన రైల్వే అధికారులు

కాజీపేట, డిసెంబర్4: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా కాజీపేట రైల్వే జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించే పలు ప్రయాణికుల రైళ్లను నేడు, రేపు రైల్వే అధికారులు రద్దు చేశారు. తుఫాన్ కారణంతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్- గూడూరు- సికింద్రాబాద్‌ల మధ్య నడిచే(12710/12709) సింహపురి సూపర్ ఫాస్ట్ రైలును ఈ నెల 4, 5, 6 తేదీల్లో రద్దు చేశారు. అదేవిధంగా చెన్నై- హైదరాబాద్‌ల మధ్య నడిచే (12759) చార్మినార్ సూపర్ ఫాస్ట్ రైలును, తిరుపతి- సికింద్రాబాద్‌ల మధ్య నడిచే (12763) పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను 5వ తేదీన, సికింద్రాబాద్-తిరుపతిల మధ్య నడిచే (12764) పద్మావతి సూపర్ ఫాస్ట్ రైలు ఈ నెల 5, 6 తేదీల్లో, తిరుపతి- ఆదిలాబాద్- తిరుపతిల మధ్య నడిచే(17405/17406) కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలును 5, 6 తేదీల్లో రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. దీంతో పాటుగా సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని వరంగల్, చింతలపల్లి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న మూడో లైన్ ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా సికింద్రాబాద్- రాయపూర్‌ల మధ్య నడిచే (12771) రైలును ఈ నెల 6, 8, 11, 13 తేదీల్లో, రాయపూర్- సికింద్రాబాద్‌ల మధ్య నడిచే(12772) రైలును ఈ నెల 7, 9, 12, 14 తేదీల్లో నాగపూర్ మీదుగా దారి మళ్లించి నడుపుతున్నట్లు తెలిపారు. వీటితో పాటు విజయవాడ-కాజీపేట రైల్వే జంక్షన్, వరంగల్ మీదుగా నడిచే పలు ప్రయాణికుల రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడిచినట్లు రైల్వే అధికారులు తెలిపారు.